అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 25 జనవరి 2023


## కృత్యాధార బోధనపై శిక్షణ

**నవతెలంగాణ-అదిలాబాద్ టౌన్**

సైన్స్ అకాడమీ, టెక్ మహీంద్రా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో జీవశాస్త్ర ఫోరం ఆదిలాబాద్ వారి సౌజన్యంతో జిల్లాలోని జీవశాస్త్ర ఉపాధ్యాయులకు ఆరు రోజుల కృత్యాధార బోధనపై లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ ఎడి నర్సిములు, ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షులు రంగినేని పవన్‌రావు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డు అండ్ లెర్న్ అండ్ టీచ్ కృత్యం చేయడం నేర్చుకోవడం బోధించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రఘు రమణ, అకడమిక్ కోఆర్డినేటర్ భాస్కర్, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉన్నారు.

## కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

**నవతెలంగాణ-సిర్పూర్(టి)**



కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని రైతువేదికలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. పరీక్షల కోసం వచ్చే వారికి అన్ని రకాల సదుపాయాలను కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకునేలా చూడాలని, మందులు, కళ్లద్దాలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ రాజేశ్వర్, డిప్యూటీ తహసీల్దార్ లలిత ఉన్నారు.

# సమస్యల ప్రస్తావన..పరిష్కారానికి భరోసా..!

- నాగోబా దర్బార్‌కు వెల్లువెత్తిన గిరిజనం
- హాజరైన మంత్రులు సత్యవతిరాథోడ్, ఇంద్రకరణ్‌రెడ్డి
- ఆలయ అభివృద్ధికి అప్పటికప్పుడు రూ.50లక్షల నిధులు
- కేస్లాపూర్‌లో వసతిగదుల నిర్మాణానికి హామీ

**నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఇంద్రవెల్లి**



ఆదిలాబాద్ జిల్లాకు తలమానికమైన కేస్లాపూర్ నాగోబా జాతర వైభవంగా కొనసాగుతోంది. మంగళవారం అధికారికంగా నిర్వహించిన గిరిజన దర్బార్‌కు గిరిజనం వెల్లువెత్తింది. ఉమ్మడి జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ఆదివాసీ గిరిజనులు, గిరిజనేతరులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అధ్యక్షతన నిర్వహించిన ఈ దర్బార్‌కు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్, దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు కాగా ఆదిలాబాద్, కుమురంభీం జిల్లా పరిషత్ అధ్యక్షులు రాథోడ్ బాపురావు, కోవ లక్ష్మీ, ఎమ్మెల్యేలు రాథోడ్ బాపురావు, కోనేరు కోనప్ప, ఎమ్మెల్సీలు దండె విఠల్, రఘోత్తంరెడ్డి, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్, అదనపు కలెక్టర్లు రిజ్వాన్‌భాషాషేక్, నటరాజ్, ఐటీడీఏ పీఓ వరుణ్‌రెడ్డి, జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**గిరిజనుల అభివృద్ధికి భరోసా..!**

ఈ దర్బార్‌లో గిరిజనుల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా కృషిచేస్తుందని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు భరోసా కల్పించారు. దర్బార్ ప్రారంభంలో పలువురు ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు మాట్లాడి సమస్యలు ప్రస్తావించారు. పోడు భూములకు హక్కుపత్రాలు జారీ చేయడంతో పాటు గతంలో గిరిజనశాఖ ద్వారా ఎడ్లబండ్లు, లిఫ్ట్‌ఇరిగేషన్ పైప్‌లైన్లు తదితర వాటిని ఇవ్వడం లేదని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చారు. ఆదివాసీలు అధికంగా ఉన్న జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, అటవీ ప్రాంతాల్లో కరెంటు స్తంభాలు వేయనీయకపోవడం తదితర వాటిని ప్రస్తావించారు. అనంతరం మంత్రులు మాట్లాడారు. గతంలో కేవలం అర్జీలకే పరిమితయ్యేవారని..తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి అర్జీలకు పరిష్కారం లభిస్తోందని మంత్రులు పేర్కొన్నారు. గిరిజనులు ఎదుర్కొంటున్న పోడు భూములకు పట్టాలు, విద్యావైద్యం, ఉపాధి తదితర వాటి పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేస్తుందని భరోసా ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాతనే దర్బార్ కోసం ప్రత్యేకంగా హాలు నిర్మించామని, ఇది వరకే ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.50లక్షల నిధులు అందజేయగా.. తాజాగా మంగళవారం రోజున దేవాదాయశాఖ ద్వారా మరో రూ.50లక్షలు మంజూరు చేస్తూ అప్పటికప్పుడు ప్రొసిడింగ్‌ను ఆలయ కమిటీ చైర్మెన్ మేస్రం తుకారం అందజేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రతిపాదనల్లో ఉన్న మరో రూ.12.50కోట్లను సైతం త్వరలోనే విడుదల చేయిస్తామని హామీనిచ్చారు. జిల్లాకు మంజూరైన నిధులు, చేపట్టిన పనుల గురించి వివరించారు. ప్రతి ఏటా గిరిజనుల ఆర్థిక తోడ్పాటుకు రుణాలు అందిస్తున్నామని రూ.50లక్షల వరకు సబ్సిడీల రూపంలో అందజేస్తున్నామని సమాధానమిచ్చారు. ఇప్పటి వరకు రోడ్ల నిర్మాణానికి రూ.340కోట్లు విడదుల చేసినట్లు వివరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తీసుకొచ్చి పోడు భూములకు పట్టాలిప్పిస్తామని మంత్రులు చెప్పడంతో ఆదివాసీ గిరిజనుల్లో హర్షం వ్యక్తమైంది.

**వెల్లువెత్తిన అర్జీలు..!**

నాగోబా దర్బార్‌కు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివాసీ గిరిజనులు, వివిధ సంఘాల నాయకులు భారీగా తరలివచ్చారు. సమావేశం ముగిసిన వెంటనే ఆదివాసులు, ఆయా సంఘాల నాయకులు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. దీంతో సభా ప్రాంగణం సందడిగా మారింది. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు సైతం జాతరలోనే ఉండి బస్సుల రాకపోకలు, ప్రయాణికులకు వసతులు తదితర వాటిని పర్యవేక్షించారు. వీరితో పాటు వివిధశాఖల అధికారులు, సిబ్బందికి వారికి కేటాయించిన విధులను నిర్వర్తించి దర్బార్‌ను విజయవంతం చేశారు. సభా జరుగుతున్న సమయంలో జీఓ నెం.3ని పునరుద్ధరించాలని కొందరు వ్యక్తులు ఫ్లెక్సీని ప్రదర్శించారు. అందరి చూపు అటువైపు పడటంతో పోలీసులు వెళ్లి వారికి నచ్చజెప్పారు. అంతకుముందు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మెన్ మేస్రం తుకారాం, ఎంపీపీ పోటె శోభ, జెడ్పీటీసీ అర్క పుష్పలత, ఐటీడీఏ సలహా సంఘం చైర్మెన్ కనక లక్కేరావు, సర్పంచ్ మేస్రం రేణుకనాగ్‌నాథ్, జిల్లా మేడి మేస్రం దుర్గు, బొంత ఆశారెడ్డి,అర్క కమ్ము, పటేల్ వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**ఈ వేదిక తెలంగాణ ప్రభుత్వమే కట్టించింది : రేఖానాయక్, ఖానాపూర్ ఎమ్మెల్యే**

నాగోబా ఆలయంలో తెలంగాణ ప్రభుత్వం అనేక అభివృద్ధి పనులు చేపట్టిందని ఈ వేదికను సైతం నిర్మించింది. జోడేఘాట్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేసింది. ఈ అభివృద్ధి పనులు బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌కు కనిపించడం లేదా..? కేంద్రం జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఎందుకు ఇవ్వడం లేదు. అటవీ ప్రాంతాల్లో రూ.200కోట్ల అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది కానీ కేంద్రం అటవీ అనుమతులు ఇవ్వడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వమే గిరిజనుల అభివృద్ధికి దోహదం చేస్తోంది.

**అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం : సిక్తాపట్నాయక్, జిల్లా కలెక్టర్**

రెండేండ్ల విరామం తర్వాత దర్బార్ నిర్వహిస్తున్నాం. సుమారు 5లక్షల మంది వరకు వస్తారని అంచనా వేశాం. ఐటీడీఏతో పాటు సంబంధితశాఖల అధికారుల సమన్వయంతో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. శానిటేషన్, తాగునీరు, వైద్యం తదితర సదుపాయాలు కల్పించాం. రూ.10కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. అన్నిశాఖల అధికారులు, సిబ్బంది కృషితో ఈ జాతరను విజయవంతం చేశాం.

**గిరిజనుల సంక్షేమానికి కృషి : వరుణ్‌రెడ్డి, ఐటీడీఏ పీఓ**

గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఐటీడీఏ నిరంతరం కృషిచేస్తుంది. ఐటీడీఏ పరిధిలో 3లక్షల ఎకరాలకు 80వేల మంది పోడు భూములకు హక్కుపత్రాలు అందజేయాలని దరఖాస్తులు చేసుకున్నారు. ఇవి ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. వీటితో పాటు గిరిజనులు ఎదుర్కొంటున్న ఆయా సమస్యలన్నింటినీ పరిష్కరించేలా కృషి చేస్తాం.






## వసతులపై అదనపు కలెక్టర్ ఆరా



**నవతెలంగాణ - కౌటాల**

అదనపు కలెక్టర్ పాలనాధికారిని చాహత్ బాజ్‌పాయి మంగళవారం మండలంలోని పలు వసతులపై ఆరా తీశారు. విద్యార్థుల సౌకర్యాలు, కంటి వెలుగు వసతులు, వైద్యసేవలు, ప్రకృతివనాల్లోని చెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల కేంద్రంలోని కంటి వెలుగు కేంద్రాన్ని తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించారు. పల్లె ప్రకృతివనంలోని మొక్కల వివరాలు, వనంలో ఉన్న వసతులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతి గదులను పరిశీలించి అవసరమైన వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాల తీరు, సిలబస్ ఎంతవరకు పూర్తయిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, మరుగుదొడ్ల సమస్యల గురించి ప్రిన్సిపాల్ స్వరూపను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని గదులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, రాత్రీపగలు వైద్యసేవలందించాలన్నారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న అమ్మ క్యాంటీన్‌లో రూ.10 భోజనం రుచి చూసి నిర్వాహకులను అభినందించారు. ప్రభుత్వం ద్వారా చేపడుతున్న ఏ ఒక్క అభివృద్ధి పథకాన్ని నిర్లక్ష్యం చేయకుండా ప్రజలకు చేరే విధంగా చూడాలన్నారు. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అధికారులు ఐకమత్యంతో పనిచేయాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ మునావర్ షరీఫ్, ఎంపీడీఓ నస్రుల్లాఖాన్, ఎంపీఓ సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి సాయికృష్ణ, వైద్యసిబ్బంది ఉన్నారు.

## విప్రో ఉపకార వేతనాలకు ఎంపిక



**నవతెలంగాణ-కాగజ్‌నగర్**

విప్రో ఉపకార వేతనాలకు కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డి లక్ష్మీనరసింహం తెలిపారు. కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న కె మానస, ఈ రేణుక, ఎ స్వాతి, డి అంజలి, ఎ సునీతలు ఈ ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు ఆయన వివరించారు. వీరు డిగ్రీలో మూడేళ్ల పాటు ఈ ఉపకార వేతనాలు పొందనున్నట్లు తెలిపారు. మూడేళ్లకు గాను ఒక్కొక్కరికి రూ. 72 వేల చొప్పున ఉపకార వేతనాలను సంతూర్ విప్రో కేర్ కంపెనీ వారు అందించనున్నట్లు తెలిపారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా విప్రో కంపెనీ ప్రతీ ఏటా గ్రామీణ ప్రాంత ప్రతిభ కలిగిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ ఉపకార వేతనాలు అందిస్తోంది. గత మూడేళ్ల నుండి ఇప్పటి వరకు ఈ కళాశాలకు చెందిన మొత్తం 18 మంది విద్యార్థులు ఈ ఉపకారవేతనాలకు ఎంపికవడం గమనార్హం.

## వికాస పిల్లల జన్మదిన వేడుకలు



**నవతెలంగాణ-భీమారం**

మహిళ మహాసభలో భాగంగా కార్మెల్ అనుబంధ సంస్థ జ్యోతి వికాస సాంఘిక సేవా సంఘం ఆధ్వర్యంలో మహిళా మహా సభను మంగళవారం నిర్వహించారు. మండల కేంద్రంలోని సుమాహెత్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి తహసీల్దార్ వాసంతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అనాథ పిల్లల జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రతి ఏడాది కార్మెల్ సేవా సంస్థ అందించే స్కాలర్‌షిప్‌లను 23 మందికి రూ.41వేలను తహసీల్దార్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో కార్మెల్ సంస్థ అధ్యక్షుడు జియో, జూలిమాథ్యు, ఎస్ఐ సుధాకర్, ఫ్లవలెట్, అర్పిత, సాంటరోస్, ఏమ్మి, సునిత, రాజేశ్వరి, మహిళా సమైఖ్య సభ్యులు శిరిష, జ్యోతి గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.



## రుణాలకు 31న ఇంటర్వ్యూ

**నవతెలంగాణ-సిర్పూర్(టి)**

2022-23కు గాను మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 31న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ రాజేశ్వర్ తెలిపారు. దరఖాస్తుదారులు ఉదయం 11గంటలకు హాజరుకావాలని కోరారు.

## దళారుల మాటలు నమ్మొద్దు : టీజీబీ చైర్మెన్ శోభ

**నవతెలంగాణ - కౌటాల**



ఖాతాదారులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్‌పర్సన్ వై శోభ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి కళ్యాణ మండపంలో స్వయం సహాయక సంఘాలకు రుణాల పంపిణీ, రుణ వితరణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో సైబర్ నేరగాళ్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారని, వారి మోసపూరిత మాటలు నమ్మవద్దన్నారు. దళారులు సామాన్య ప్రజలను మోసం చేసేందుకు తక్కువ వడ్డీ రుణాలు ఇప్పిస్తామని మాయమాటలు చెబుతారని తెలిపారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకులో అన్ని రకాల రుణాలు తక్కువ వడ్డీకే ఇస్తున్నట్టు తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు అతి తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నామని, సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు తమ కాళ్లపై నిలబడే విధంగా స్వయంశక్తిని పెంచుకోవాలన్నారు. కౌటాల స్వయం సహాయక సంఘాలు డిటర్జెంటు, స్వీట్లు, తేనె తయారు చేశారని, అలా చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారుగా 25వేల కోట్లకు పైగా రుణాలు ఇచ్చినట్టు తెలిపారు.కౌటాల, ముత్తంపేట్ బ్యాంకుల్లో బీమా చేయించుకొని ప్రమాదంలో మృతి చెందిన బూర అంకులు భార్య శ్యామలకు, పార్డీ గ్రామానికి చెందిన నౌగడి మాయబాయి భర్త ఎమ్మాజీకి ఒక్కొక్కరికి రూ.20లక్షల చొప్పున ప్రమాద బీమా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, ఎల్‌డీఎం హన్మంత్‌రావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి సురేందర్, కౌటాల టీజీబీ మేనేజర్ జి నరసింహస్వామి, రీజినల్ మేనేజర్ మురళీ మనోహర్‌రావు, స్వయం సహాయక సంఘాల మండలాధ్యక్షురాలు కమల, ఏపీఎంలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

## మహిళలకు న్యాయ సేవపై అవగాహన ఉండాలి

- జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే




**నవతెలంగాణ-తాంసి**

మహిళలకు చట్టాలు, న్యాయ వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో ఐకేపీ గ్రూప్ సభ్యులతో పాటు మహిళలకు న్యాయ సేవా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలు అక్షరాస్యత కలిగి ఉండాలన్నారు. నిస్సాహాయ పరిస్థితుల్లో, పేదరికంలో ఉన్న వారికి న్యాయ స్థానం సహాయం అందిస్తుందన్నారు. ఇల్లాలి చదువు కుటుంబానికి వెలుగు అని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకెళ్తున్నారని తెలిపారు. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నిత్యావసర సరుకుల దుకాణం, అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీదేవి. ఎంపిడిఓ భూమయ్య, సర్పంచ్ స్వప్న రత్నప్రకాష్, ఎంఈఓ శ్రీకాంత్, న్యాయవాది ప్రసాద్, ఉమేష్ దోలే పాల్గొన్నారు.

## సెమీఫైనల్‌కు ఎస్టీపీపీ క్రికెట్ పోటీలు

- 26న ఫైనల్ మ్యాచ్



**నవతెలంగాణ-జైపూర్**

సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు సెమీ ఫైనల్‌కు చేరినట్లు నిర్వాహకులు పంతులా నాయక్ తెలిపారు. పది సంవత్సరాలుగా ఎస్టీపీపీ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తుండగా 10 జట్లు ఈ క్రికెట్ పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. మంగళవారం నిర్వహించిన సెమీ ఫైనల్ పోటీల్లో నాలుగు జట్లు ఎలిమినేట్ అయినట్లు తెలిపారు. ఎస్టీపీపీ-1 జట్టుతో పీఎంపీఎల్-1 జట్టు తలపడగా నిర్ణీత 15 ఓవర్లలో ఎస్టీపీపీ జట్టు 79 రన్స్ సాధించగా ఎంపీఎంపీఎల్-1 జట్టు 13.2 ఓవర్లలో 74 రన్స్‌తో ఆలౌట్ అయినట్లు వెల్లడించారు. ఎస్టీపీపీ జట్టులో ఆడిన క్రీడాకారుడు గడ్డం రాకేశ్ 3 ఓవర్లలో 3 వికెట్లు తీసుకోవడంతో పాటు 15 రన్స్ చేసి మ్యాన్ ఆఫ ది మ్యాచ్‌గా నిల్చినట్లు తెలిపారు. సెమీఫైనల్‌లో తలపడిన రెండు జట్లు చక్కటి ఆట నైపుణ్యాన్ని ప్రదర్శించాయని జీఎం సూర్యనారాయణ రాజు పేర్కొన్నారు. అదేవిధంగా ఎలిమినేట్ మ్యాచ్ పీఎంపీఎల్-2తో ఎసీసీఎల్-3 తలపడిన ఆటలో పీఎంపీఎల్ విజయం సాధించినట్లు పేర్కొన్నారు. గడిచిన నాలుగు రోజులుగా సమర్థవంతంగా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న పంతులా నాయక్‌తో పాటు సహకరిస్తున్న అధికారులు, సిబ్బందిని జెఎన్ సింగ్ అభినందించారు.

## మాస్టర్ ప్లాన్‌పై ఆందోళన చెందొద్దు



**నవతెలంగాణ-నిర్మల్**

మాస్టర్ ప్లాన్‌పై రైతులు, ప్రజలు ఎలాంటి ఆందోళనలు చెందవద్దని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. మంజులాపూర్‌లో మంగళవారం పారిశ్రామిక జోన్‌ను, తల్వేద, మంజులాపూర్ ప్రాంతాల్లో రహదారులు బైపాస్ రోడ్డు విస్తరణపై మ్యాప్‌ను టౌన్ ప్లానింగ్ అధికారులు, రైతులతో కలిసి పరిశీలించారు. మాస్టర్ ప్లాన్, పారిశ్రామిక జోన్‌కు సంబంధించి రైతులు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని అన్నారు. మాస్టర్ ప్లాన్ పారిశ్రామిక జోన్ విషయంలో రైతులు, ప్రజలు ఆ ధైర్యపడొద్దని, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని అన్నారు. రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో చర్చించామని తెలిపారు. ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చైర్మన్ వెంట టిపిఓ సుమలత, కౌన్సిలర్ దర్శనం సాయన్న, ఆత్మ డైరెక్టర్ వినయ్, మాజీ ఎంపిపి అయిండ్ల పోశెట్టి, నాయకులు రాజారెడ్డి, రాంచందర్‌రెడ్డి, బాపురెడ్డి, గంగారెడ్డి పలువురు రైతులు ఉన్నారు.

## టీఎన్‌జీఓ గ్రామీణ నూతన కమిటీ ఎన్నిక



**నవతెలంగాణ-నిర్మల్**

టీఎన్‌జీఓ యూనియన్ నిర్మల్ గ్రామీణ నూతన కమిటీని మంగళవారం సంఘ భవనంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు వి.ప్రభాకర్, కార్యదర్శి కుడాల రవికుమార్, కోశాధికారి బి.సురేందర్ పర్యవేక్షణలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జి.విక్రంరాజ్, కార్యదర్శిగా కె.అజయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా తోట రాజేందర్, రమణారావు, బండారి శ్రీదేవి, దీపిక, సంయుక్త కార్యదర్శిగా సంజీవరెడ్డి, కోశాధికారిగా మోహన్ రాథోడ్, ప్రచార కార్యదర్శిగా మల్లికార్జున్, కార్యవర్గ సభ్యులుగా కిష్టారెడ్డి, సూర్యనారాయణ, కీర్తిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా శ్రీరామ్, శ్రీనివాస్ వ్యవహరించారు.

## కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

**ఇచ్చోడ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగును మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ నిమ్మల ప్రీతమ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమన్ని ఎంపీపీ పరిశీలించి కంటి పరీక్ష చేయించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 సంవత్సరాలు పై బడిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలిని తెలిపారు. మండలంలో వందశాతం కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు నిరంతరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఈఓ సూర్యప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## జంతు హింస నివారణపై అవగాహన

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

మండలంలోని రాజూరా గ్రామంలో పశుసంవర్దక శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ ఏ.దీప్తి, డాక్టర్ హెచ్.విజయ్‌కుమార్ జంతు హింస నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. మంగళవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో పశువులకు చికిత్స నిర్వహించడంతోపాటు ఉచిత పశుగర్భకోశ చికిత్సలపై కూలంకుషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, విడిసి బాధ్యులు, రైతులు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## గుంటూరు రైతులకు న్యాయం చేయాలి

- వామపక్షాల డిమాండ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

ఆదిలాబాద్ వ్యాపారి చేతిలో మోసపోయిన గుంటూరు రైతులకు న్యాయం చేయాలని సీపీఐ, సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సదరు వ్యాపారి ఇంటిముందు గుంటూరు రైతులు చేపట్టిన ధర్నా శిబిరానికి చేరుకొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గుంటూరు జిల్లా అమరావతి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన రైతులు వారి భూములు అమ్మగా వచ్చిన డబ్బులను పట్టణానికి చెందిన జిన్నింగ్ వ్యాపారి సచిన్‌కు ఇచ్చారని అన్నారు. వారి నుండి సుమారు ఆరున్నర కోట్ల రూపాయల అప్పుగా తీసుకొని తిరిగి చెల్లించకుండా రెండు సంవత్సరాలుగా మాయమాటలతో మభ్య పెడుతున్నారని తెలిపారు. బాధిత రైతులు రెండు రోజులుగా వ్యాపారి ఇంటిముందే బైటాయించి నిరసన తెలియజేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వారి న్యాయమైన పోరాటానికి జిల్లా వామపక్ష పార్టీలుగా సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామన్నారు. వ్యాపారి తీరు వల్ల అదిలాబాద్ పట్టణానికి, వ్యాపారులకు చెడ్డపేరు వస్తోందని, వెంటనే వ్యాపారి స్పందించి వారికి న్యాయంగా ఇవ్వాల్సిన డబ్బులను చెల్లించాలని తెలిపారు. కలెక్టర్, ఎస్పీ వెంటనే జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు మద్దతు తెలిపిన వారిలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బండి దత్త్రాత్రి, జిల్లా కార్యదర్శి స్వామి, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆత్రం కిష్టన్న, కిశోర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి, ఎస్.స్వామి, గిరిజన నాయకులు సిడాం మాధవ్, కినక దరుము, సిపిఐ నాయకులు కుంటాల రాములు ఉన్నారు.

## కళావేదిక నిర్మించిన ఉపాధ్యాయుడు లక్ష్మణ్



నవతెలంగాణ-సారంగాపూర్

చిన్నతనంలో చదివిన పాఠశాలకు గురు దక్షణగా సుమారు రూ.60వేలు కళావేదిక నిర్మించి దాతృత్వం చాటుకున్నారు గణిత ఉపాధ్యాయుడు జె.లక్ష్మణ్. మండలంలోని ధని గ్రామానికి చెందిన లక్ష్మణ్ చిన్నతనంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందించాలని విద్యార్థుల సౌకర్యార్థం కళావేదిక నిర్మించారు. మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి దీన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ రూ.60 వేలు సొంత నిధులతో వేదిక నిర్మించడం పట్ల లక్ష్మణ్‌ను అభినందించారు. విద్యార్థులు బాగా చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. జీవితంలలో ఉన్నత స్థానంలో నిలిచి పాఠశాలకు, ఉపాధ్యాయులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ దంపతులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు సన్మానించారు. అడెల్లి పోచమ్మ ఛైర్మెన్ అయిటి చందు పాల్గొని విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్,పెన్నులు, నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు. సలోమి కరుణ, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు జట్టు గజేంధర్, సర్పంచ్ లక్ష్మీ చిన్నయ్య, విడిసి అధ్యక్షులు సుధాకర్, జిల్లా సహాయ పరీక్షల కమిషనర్ పద్మ, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి జె. లక్ష్మణ్, మాజీ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## చిరుధాన్యాలపై అవగాహన పెంచుకోవాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

చిరుధాన్యాల వంటలపై అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రమోద్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని భూతాయి(బి) గ్రామంలో చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కేవలం పత్తి, వరి, ఇతర వాణిజ్య పంటలే కాకుండా చిరుధాన్యాలు సాగు చేయడం వల్ల ఆర్థికంగా మేలు జరుగుతుందన్నారు. జొన్నలు, కొర్రలు, సామలు, రాగులు, అరికెలు, ఊదలు, వరిగలు సాగు చేసుకోవచ్చని చెప్పారు. వీటి పంట కాలం కేవలం 70 నుంచి 100 రోజులు మాత్రమేనని, పెట్టుబడి కూడా తక్కువగానే ఉంటుందని వివరించారు. వీటిని బీడు భూముల్లో కూడా సాగు చేసుకోవచ్చన్నారు. ఈ 14 రకాల చిరుధాన్యాల్లో ప్రొటీన్స్ అధికంగా ఉంటాయని, జీర్ణశక్తిని పెంచడంతో పాటు గుండె సంబంధిత వ్యాధులు కూడా దరిచేరవని వివరించారు. ప్రజలు కూడా ఆరోగ్య పరిరక్షణ కోసం చిరుధాన్యాలను తీసుకోవాలని వ్యవసాయ అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్వల్ అనిత, వ్యవసాయ విస్తరణ అధికారి రాజేశ్వర్, గ్రామస్తులు కావిందర్ పాల్గొన్నారు.

# దారులన్నీ నాగోబా వైపే..!

- దర్బార్‌లో థింసా, కోయ నృత్యాలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్రంలోనే రెండవ అతిపెద్ద జాతరగా పేరుగాంచిన కేస్లాపూర్ జాతరకు మంగళవారం భక్తులు తండోప తండాలుగా తరలిరావడంతో జనసంద్రంగా మారింది. ఇదే రోజు దర్బార్ కావడంతో భక్తుల తాకిడి పెరిగింది. ఎక్కడ చూసినా జనం సందోహం నెలకొంది. నాగోబా దేవత దర్శనం కోసం భక్తులు గంటల తరబడి బారులు తీరారు. జాతర దర్బార్‌కు ఇద్దరు మంత్రులు రావడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మంత్రులను కోయ రాజులు, థింసా నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. నాగోబా దర్బార్‌లో ఆదివాసులు జిఓ.నెం.3ను పునరుద్ధరించాలని మంత్రులు సత్యవతి రాథోడ్, ఇంద్రకరణ్‌రెడ్డిలకు వినతి పత్రాన్ని అందజేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఏఎస్పీతో పాటు ఇద్దరు డీఎస్పీల ఆధ్వర్యంలో 400 మంది పోలీసులతో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. పంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖల ఆధ్వర్యంలో తాగు నీటి సౌకర్యం, క్లోరినేషన్‌ను ముమ్మరంగా చేపట్టారు. జాతరలో వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేశారు.





## బాలికల సంక్షరణకు పాటుపడదాం : డీడబ్ల్యూఓ



నవతెలంగాణ-సారంగాపూర్

సమాజంలోని పిల్లలందరిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిలో ఉండాలని జిల్లా మహిళా శిశు , దివ్యాంగులు, వయోవృద్దుల సంక్షేమ శాఖ అధికారిణి కె.విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని చించొలి(బి) మహిళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జాతీయ బాలికా దినోత్సవంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. నేటి బాలలే రేపటి బావి భారత పౌరులన్నారు. బాలలకు హక్కులున్నాయని, వాటిని కాపాడాలని అన్నారు. ప్రతి ఒక్క బాలిక తన ఆత్మరక్షణ కోసం ధైర్యంతో ఉండాలని, తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంగణం అధికారిణి విజయలక్ష్మి, సిడిపివోలు నాగమణి, నాగలక్ష్మి, శ్రీమతి, సరిత, సూపర్‌వైజర్‌లు విజయగౌరి, భాగ్య, సంధ్యారాణి, మంగళ, నళిని, డీసీపీవో దేవి మురళి, సీడబ్ల్యూసీ ఛైర్మన్ వాహిద్, సైమన్ సుందర్, ఐసీడీఎస్ సీనియర్ అసిస్టెంట్ సాగర్, ఏజాజ్, శ్రీరామ్మూర్తి, సగ్గం రాజు, శ్రీనివాస్, జి.నరేందర్, శైలజ, కరుణశ్రీ, మమత, లక్ష్మణ్, అనిల్ కుమార్, సతీష్, సోని పాల్గొన్నారు.

**లక్ష్మణచాంద :** బాలికలు అన్ని రంగాల్లో ముందుకెళ్లాలని, హక్కులను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత చదువులు చదివి గొప్ప పదవులు ఆధిరోహించాలని బాబాపూర్ సర్పంచ్ శ్రీవిద్య అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వరల్డ్ విజన్ సంస్థ ఆధ్వర్యంలో బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వరల్డ్ విజన్ సంస్థ మేనేజర్ బ్రహ్మన్న మాట్లాడుతూ బాలికలందరూ తమ చదువు మీద శ్రద్ధ పెట్టి చదవడం ద్వారా తల్లిదండ్రుల నమ్మకాన్ని పొందాలని తెలిపారు. ఆడపిల్లలకు ప్రభుత్వపరంగా చాలా అవకాశాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్, ప్రధానోపాధ్యాయులు ధర్మేందర్, విద్యా కమిటీ చైర్మన్ బొట్టు రాజేశ్వర్, వరల్డ్ విజన్ సంస్థ ప్రతినిధి రాజేశ్వర్, గ్రామస్తులు, బాలబాలికలు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షన్ వాల్ పెయింట్ పోటీల పరిశీలన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

స్వచ్ఛ సర్వేక్షన్‌లో పట్టణాన్ని ముందుంచడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని మున్సిపల్ ఛైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2022లో భాగంగా స్వచ్ఛ ఆదిలాబాద్ కార్యక్రమాన్ని కొన్ని రోజులుగా చేపడుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా మంగళవారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఇందిరా ప్రియదర్శిని మైదానం ప్రహరీ గోడపై పెయింటింగ్ పోటీలను ఏర్పాటు చేశారు. అందులో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఔత్సాహికులు పాల్గొన్నారు. స్వచ్ఛ భారత్ లక్ష్యంగా పోటీలను ఏర్పాటు చేయగా పురపాలక శాఖ తరపున అవసరమైన వస్తువులను అందచేశారు. ప్రత్యేకంగా కౌంటర్‌లను ఏర్పాటు చేసి పోటీల్లో పాల్గొన్న వారి వివరాలను నమోదు చేసుకున్నారు. అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు శిక్షణ కలెక్టర్ శ్రీజ, మున్సిపల్ కమిషనర్ శైలజ పోటీలను పర్యవేక్షించి ఔత్సాహికులను అభినందించారు. ఈ మేరకు మున్సిపల్ ఛైర్మన్ జోగుప్రేమేందర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా నిర్వహిస్తున్న పెయింటింగ్ పోటీలకు మంచి స్పందన లభించిందని, దాదాపు 72 మంది తమ ప్రతిభను కనబరిచారని తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి గణతంత్ర దినోత్సవం రోజున కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేస్తామని వెల్లడించారు. కళాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని, భవిష్యత్తులోనూ పురపాలక శాఖ తరపున మరిన్ని పోటీలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

## ఘనంగా మార్కండేయ జయంతి ఉత్సవాలు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల శాలీ వాహన కుల సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో మార్కండేయ ఊరేగింపు కన్నుల పండుగగా కొనసాగింది. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కండేయ ఆలయ కమిటీ నాయకులు బిట్లింగ్ నారాయణ, జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, ఓస రాజు, మోహన్, శాలీ వాహన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

**జైనథ్ :** మండల కేంద్రంలో మంగళవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. పద్మశాలి అధ్యక్షులు దాసరి అడెల్లు దంపతులు పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు సర్పంచ్ దుమాల దేవన్న, రైతుబంధు కోఆర్డినేటర్ లింగారెడ్డి, మాజీ ఆలయ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ రాకేష్‌రెడ్డి, నాయకులు గడ్డం జగదీష్‌రెడ్డి, పద్మశాలి ఉపాధ్యక్షులు దాసరి వెంకన్న పాల్గొన్నారు.

**దిలావర్‌పూర్ :** నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని పద్మశాలి సంఘ భవనంలో మంగళవారం మార్కండేయ జయంతి ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కండేయ పద్మశాలి సంఘం అధ్యక్షుడు పి.గంగారాం, అల్లం నర్సయ్య, చాట్ల దామోదర్, ఆరుట్ల నవీన్ పాల్గొన్నారు.

## బదిలీల్లో ఉపాధ్యాయులందరికీ అవకాశం కల్పించాలి

- డీఈఓ కార్యాలయం ఎదుట డీటీఎఫ్ ధర్నా




నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల బదిలీలో జీవో నెంబర్ 317 వల్ల జిల్లాలకు కేటాయించిన ఉపాధ్యాయులకు ఆయా పాఠశాలల్లో సర్వీసు లేనందున ఉపాధ్యాయులందరికీ ఈ బదిలీల్లో అవకాశం కల్పించాలని డీటీఎఫ్(డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్) జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వృకోదర్ డిమాండ్ చేశారు. మంగళవారం డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరు నిరసిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం డీఈఓ ప్రణీతకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు నాయకులు మాట్లాడుతూ జీఓ నెంబర్ 317తో ఆయా జిల్లాలకు వెళ్లిన ఉపాధ్యాయులకు జీరో సర్వీస్ ఉన్న నేపథ్యంలో ఈ బదిలీల్లో వారికి నష్టం జరుగుతోందన్నారు. బదిలీల్లో ఉపాధ్యాయులందరికీ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై డిటిఎఫ్ రాష్ట్ర శాఖ పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించిందని గుర్తు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్యాముల్, జిల్లా కార్యదర్శి నాగేందర్‌తో పాటు పలువురు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మాస్టర్ ప్లాన్‌ను వెంటనే రద్దు చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్‌లో మాస్టర్ ప్లాన్‌ను వెంటనే రద్దు చేయాలని ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ ఛైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాస్టర్ ప్లాన్ పేరుతో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తన, తన బంధువుల అక్రమ భూములను సక్రమం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సోఫీనగర్‌లో సర్వే నెంబర్స్ 254, 255, 256, అలాగే సర్వే నెంబర్స్ 234, 235 భూమిని ప్రస్తుతం మాస్టర్ ప్లాన్ పేరుతో కమర్షియల్‌ను రెసిడెన్షియల్ జోన్‌లోకి, రెసిడెన్షియల్ జోన్‌లో వున్న భూములను గ్రీన్ జోన్‌లోకి, ఇండస్ట్రియల్ జోన్‌లోకి ఇష్టానుసారంగా మారుస్తున్నారని అన్నారు. మంత్రి, మున్సిపల్ ఛైర్మన్ విభిన్న ప్రకటనలు చేస్తూ ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే మున్సిపల్ మాస్టర్ ప్లాన్‌పై ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, రైతులు, సామాన్య ప్రజలకు నష్టం కలిగించేలా చేస్తున్న డ్రాఫ్ట్‌ను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో దిలావర్‌పూర్ జడ్‌పీటీసీ తక్కల రమణరెడ్డి, చందు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎనిమిది నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రిమ్స్ 300 ఓసీఎస్ కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు పేర్కొన్నారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రిమ్స్ డైరెక్టర్ ఛాంబర్ ముందు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా స్టాఫ్ నర్సులు మాట్లాడుతూ వేతనాలు సరియైన సమయంలో రాక కుటుంబ పోషణ చాలా భారంగా మారిందన్నారు. పిల్లల చదువులు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మానవతా దృక్పథంతో జిల్లా కలెక్టర్, రిమ్స్ డైరెక్టర్ స్పందించి 8నెలల వేతనాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు కమల, కృష్ణకుమారి, త్రిచరన, మీనాక్షి, ప్రశాంతి, కరుణా, వసంత, రాణి పాల్గొన్నారు.

## విషపూరిత నీళ్లు తాగి మేకలు మృతి



నవతెలంగాణ-తాంసి

విషపూరిత క్రిమిసంహారక మందు కలిపిన నీళ్లు తాగి 15 మేకలు మృతి చెందాయి. మండల కేంద్రానికి చెందిన పుట్ట పెంటన్న రోజు లాగే తన మేకల మందను మేపటానికి చెరువు ప్రాంతంలో గల పంట పొలాల పరిసర ప్రాంతాల్లోకి వెళ్లాడు. పంట పొలంలో ఉన్న బకెట్లో పంటలకు వేసే విషపూరిత మందు కలిపి ఉండడంతో ఆ నీటిని మేకలు తాగాయి. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాయి. గమనించిన యజమాని పశువైద్యాధికారికి సమాచారం అందించాడు. చికిత్స చేస్తుండగానే రక్తం కక్కుతూ మృతి చెందాయి. దాదాపు రెండు లక్షల నష్టం జరిగిందని యజమాని వాపోయాడు. మృతి చెందిన మేకలను చూసి యజమాని కన్నీటి పర్యంతమయ్యాడు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు. పశు వైద్యాధికారి శ్రీకాంత్ పంచనామా నిర్వహించారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయలు

నవతెలంగాణ-ఉట్నూర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని దేవుగూడలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..నార్నూర్ మండలం తాడిహత్నూర్ గ్రామంలో బీపీఎంగా విధులు నిర్వర్తిస్తున్న జాదవ్ గోకుల్ తాడిహత్నూర్ నుంచి ఉట్నూర్ వైపు కారు(టీఎస్01ఈకే3004)లో వస్తున్నాడు. హస్నాపూర్ నుండి తాడిహత్నూర్ వైపుకు గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో మండలంలోని దేవుగూడ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ద్విచక్ర వాహనంపై వెళ్లే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా వెంటనే 108కి సమాచారం అందించారు. స్థానిక ఆసుపత్రిలో చికిత్స నిర్వహించి వైద్యుల సూచన మేరకు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

## పదోన్నతుల ప్రక్రియను పరిశీలించిన టీయూటీఎఫ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ప్రధానోపాధ్యాయుల పదోన్నతులకు అర్హత కలిగిన ఆయా సజెక్టుల స్కూల్ అసిస్టెంట్‌లు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ సర్వీసు రిజిస్టర్‌తో మంగళవారం వివరాలను అందజేశారు. ఈ ప్రక్రియను టీయూటీఎఫ్ అధ్యక్షులు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి జలంధర్‌రెడ్డి దగ్గరుండి పరిశీలించారు. అవసరమైన వారికి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు.

## బాసరకు ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-నిర్మల్

ఈ నెల 26న వసంత పంచమిని పురస్కరించుకొని నిర్మల్ బస్టాండ్ నుండి ఉదయం 6 గంటల నుండి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎస్.సాయన్న మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పర్చుకోవాలని తెలిపారు.

## గర్భిణులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని జనకాపూర్ రైతువేదికలో గర్భిణులకు జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గర్భిణుల్లో రక్తహీనత తగ్గించటంతో పాటు పుట్టబోయే శిశువు ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి పోషకాహార కిట్ ప్రవేశపెట్టారని తెలిపారు. గర్భిణుల ఆరోగ్యానికి ఇది ఎంతగానో పనిచేస్తుందన్నారు. అనంతరం గ్రామ పరిధిలోని 35 మంది గర్భిణులకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు బొమ్మన రామగౌడ్, కోఆర్డినేటర్ శ్యామ్ లాల్, ఎంఎల్‌హెచ్‌పీ. రజిత, లావణ్య, సువర్ణ పాల్గొన్నారు.

## వరి పంట సాగుపై అవగాహన

నవతెలంగాణ-కోటపల్లి



చెన్నూర్ మండలంలోని నారాయణ్‌పూర్, అముదాలపల్లి గ్రామాలలోని వరి పంట పొలాలను మంగళవారం ఏఓ కవిత పరిశీలించి రైతులకు వరిపంట సాగులో మెళుకువలపై అవగాహన కల్పించారు. వరి పొలాలలో పిక పురుగు వల్ల పంట దిగుబడి తగ్గుతుందని దీనిని నివారించడానికి పంట విత్తిన 15 రోజుల లోపు గుళికలు వాడాలని సూచించారు. నాటు పెట్టే పద్ధతి కంటే వెదజల్లే పద్ధతి ద్వారా రైతులు ఖర్చును తగ్గించు కోవచ్చని అన్నారు. రసాయన ఎరువులు కాకుండా ఆర్గానిక్ ఎరువులతో పంటను పడించి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. అలాగే పంట నమోదు చేసుకున్నారు. ఏ సర్వే నంబర్‌లో ఏ పంట వేశారో రైతులను అడిగి నమోదు చేసుకున్నారు. ఆమె వెంట ఏఈఓ రాజశేఖర్ ఉన్నారు.

# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్

నవతెలంగాణ-నస్పూర్

పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని వదో వార్డులోని ప్రభుత్వ పాఠశాలలో తడి-పొడి చెత్త కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తడి-పొడి చెత్త విభజన చేసే విధానము, దాని నిర్వహణ విధానం, వాటిని డికంపోజ్ చేసే విదాన్ని వివరించారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ నిర్వహించి, ప్రతి ఇంట్లో రోజు తడిచెత్తా పొడిచెత్తను వేరు వేరు చెత్త బుట్టలలో వేసి మున్సిపల్ ట్రాలిలో వేయాలని తెలిపారు. ఇలా చేయడం వల్ల ఎలాంటి అనారోగ్యాలకు గురికాకుండా ఉండవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి, వార్డు ఆఫీసర్‌లు ప్రభాకర్, లక్ష్మయ్య, బిల్ కలెక్టర్ శ్రీపతి సురేష్ కుమార్, ఎం.శివ రామకృష్ణ పాల్గొన్నారు.

**కోటపల్లి :** చెన్నూర్ మండలంలోని పలు గ్రామాల్లో తడి-పొడి చెత్తపై మంగళవారం అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఎంపీఓ అజ్మత్ అలి ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు తిరుగుతూ తడి-పొడి చెత్తపై అవగాహన కల్పించారు. తడి-పొడి చేత్తను వేరు చేసే విదానంపై విద్యార్థులకు, గ్రామస్తులకు వివరించారు. అనంతరం మాట్లాడుతూ చెత్త బయట పడవెయ్యకుడదని పొద్దున వచ్చే గ్రామ పంచాయితీ ట్రాక్టర్‌లలో మాత్రమే వేయాలని అన్నారు. చెత్తతో కంపోస్ట్ ఎరువును తయారు


నస్పూర్‌లో..

చేస్తారని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి.శ్రీనివాస్, ఏంఈఓ రాధకృష్ణ మూర్తి పాల్గొన్నారు.

**జన్నారం :** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మంగళవారం తడి-పొడి చెత్తపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. సందర్భంగా ఎంఈఓ విజయ్ కుమార్, ఎంపీఈఓ రమేష్ మాట్లాడుతూ మంచిర్యాల అదనపు కలెక్టర్ రాహుల్ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

**తాండూర్ :** మండలంలోని ద్వారకాపూర్ బోయపల్లె గ్రామ పంచాయతీలో ఎంపీఓ సత్యనారాయణ, ద్వారకాపూర్ కార్యదర్శి సురేష్ కుమార్ తడి-పొడి చెత్త పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంట్లో వెలువడిన తడి-పొడి చెత్తను వేరు చేసి ఇంటి ముందుకు వచ్చిన గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో వేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సీప జనార్ధన్ పాల్గొన్నారు.

**రామకృష్ణాపూర్ :** స్వచ్ సర్వేక్షన్‌లో భాగంగా తడిచెత్తను పొడిచెత్తను వేరుచేయు విధానంపై పట్టణంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు మున్సిపల్ సిబ్బంది, కమిషనర్ వెంకట నారాయణ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమమం నిర్వహించారు. ప్రతి ఒక్కరు తడిచెత్త పొడిచెత్త నిర్వహణలో భాగస్వాములు అవుతూ స్వచ్ సర్వేక్షన్ కార్యక్రమమంను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ కె.నాగరాజు, సానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ వసంత్, ఏ.శ్రీధర్ పాల్గొన్నారు.

**లక్షెట్టిపేట్ :** తడి, పొడి చెత్తను ఇంటి వద్దనే వేరు చేయాలని ఎంపీడీఓ నాగేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జెండా వెంకటాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలతో పాటు అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తడి, పొడి చెత్తపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంట్లో పోగయ్యే తడి చెత్తను ఆకుపచ్చ డబ్బాలో, పొడి చెత్తను నీలం రంగు డబ్బాలో వేయాలని తెలిపారు. తమ ఇంటి ముందరకు వచ్చే చెత్త సేకరణ వాహనానికి తడి, పొడి చెత్తలను వేరువేరుగా అందించాలని కోరారు. కార్యక్రమాల్లో ఏపీఓ వెంకట రమణ, గ్రామ సర్పంచ్ ఎల్తాపు సునీత సుధాకర్ పాల్గొన్నారు.

**కాసిపేట :** మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ పరిధిలోని పాఠశాలల్లో స్వచ్ఛ ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా తడి చెత్త పొడి చెత్త, పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.


కోటపల్లిలో..


జన్నారంలో..


రామకృష్ణాపూర్‌లో..


తాండూర్‌లో..

## కేజీబీవీ, గురుకులాల సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

- ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా




నవతెలంగాణ-ఆసిఫాబాద్

కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయాల్లో, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా డిమాండ్ చేశారు. మంగళవారం కలక్టరేట్ ఎదుట నిరసన తెలిపి ఏవోకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బోధనేతర సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదన్నారు. దీనితో అతి తక్కువ వేతనాలతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీఆర్సి కమిషన్ సూచన మేరకు కనీస వేతనం రూ.19000 అమలు చేయాలని జీఓ నెం 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ జీఓ ప్రకారం కేటగిరి 1కి రూ.15600, కేటగిరి 2 కు రూ.19500, కేటగిరి 3కు రూ.22750 చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేజీబీవీ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు భవాని, పడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, కేజీబీవీ సంఘం నాయకురాలు భాగ్య, విజయలక్ష్మి, రాజేశ్వరి, ధనలక్ష్మి, విజయమ్మ, మునీర్, శైలజ, ఉమాభారతి పాల్గొన్నారు.

## బొగ్గు నాణ్యత పెంచేందుకు యాజమాన్య చర్యలు




నవతెలంగాణ-నస్పూర్

వినియోగదారులు సూచించిన విధంగా బొగ్గు నాణ్యత పెంచడానికి యాజమాన్యం తగిన చర్యలు తీసుకుంటుందని డైరెక్టర్ ఆపరేషన్ చంద్రశేఖర్, డైరెక్టర్ ఫైనాన్స్, ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ బలరాం అన్నారు. బొగ్గు నాణ్యత వారోత్సవాల ముగింపు కార్యక్రమం సోమవారం శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి గెస్ట్ హౌస్ క్వాలిటీ జనరల్ మేనేజర్ (కార్పొరేట్) హబిబ్ హుస్సేన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.సమావేశంలో డైరెక్టర్లతోపాటు శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేయడానికి సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఎప్పటికప్పుడు తగిన ప్రణాళికలు వేసుకొని ముందుకు వెళుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా క్వాలిటీ జనరల్ మేనేజర్ కార్పొరేట్ హబిబ్ హుస్సేన్ వార్షిక నివేదికను నివేదించారు. వినియోగదారులు లేనిదే సంస్థ లేదని బొగ్గు నాణ్యత విషయంలో వినియోదారులు సంతృప్తి చెందకపోతే సంస్థ మనుగడ కష్టతరం అవుతుందని వివరించారు.కార్యక్రమంలో జనరల్ మేనేజర్ రామగుండం 2 మనోహర్, జనరల్ మేనేజర్ (క్వాలిటీ) రామగుండం రీజియన్ కె.వి. రావు, జనరల్ మేనేజర్ (క్వాలిటీ) కొత్తగూడెం రీజియన్ రవి కుమార్, బెల్లంపల్లి రీజియన్ (క్వాలిటీ) జనరల్ మేనేజర్ రాజేశ్వర్, ప్రాజెక్టు ఆఫీసర్లు ఎం.శ్రీనివాస్, వి పురుషోత్తమరెడ్డి, క్వాలిటీ మేనేజర్ కె వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను అరికట్టాలి



నవతెలంగాణ-తాండూర్

బాల్యవివాహాలను సమిష్టిగా నిర్మూలించాలని విద్యా భారతి విద్యా సంస్థల డైరెక్టర్ సురభి శరత్ కుమార్ అన్నారు. ఆయన మంగళవారం జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా తాండూర్ విద్యా భారతి ఉన్నత పాఠశాల విద్యార్థినిలచే ఐబీ కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలను చిన్నచూపు చూడకుండా పురుషులతో సమానంగా సమాజంలో స్థానం కల్పించాలని కోరారు. చదువుతోపాటు ఉద్యోగ వకాశాలు కల్పించి సమాజంలో సముచిత స్థానంఇవ్వాలన్నారు. అంతేగాక ఆడపిల్లలకు 21 సంవత్సరాల వయసు వచ్చేవరకు వివాహాలు చేయరాదని అన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత కస్తూర్బా పాఠశాల ఎస్ఓ కవిత కస్తూర్బా పాఠశాలలో బాలిక దినోత్సవం నిర్వహించారు.

## నర్సరీల్లో మొక్కలు కాపాడాలి



నవతెలంగాణ-కోటపల్లి

చెన్నూర్ మండలంలోని అంగ్రజ్‌పల్లి, అస్నద్ గ్రామాలలోని నర్సరీలను ఎంపీడీఓ టి.శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరిత హారంలో బాగంగా మొక్కలను పెంచాలని ఆదేశించారు. నర్సరీలో మొక్కలకు వేసవిలో ఎండ తగలకుండా షేడ్ నెట్లు ఏర్పాటు చేసి మొక్కలను కాపాడాలని అన్నారు. మొక్కల బెడ్లకు ఉదయం, సాయంత్రం నీరు పట్టాలని, బెడ్లలోని పిచ్చి మొక్కలను తీసివేయాలి నర్సరీ సిబ్బందికి సూచించారు.

# మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




నవతెలంగాణ-ఆసిఫాబాద్

మిషన్ భగీరథ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో సమ్మె చేస్తామని మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అల్లూరి లోకేష్, దుర్గం లింగయ్య హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ 3 నెలల జీతాలను వెంటనే ఇవ్వాలని, బోనస్, ఫోన్ బిల్లు, పెట్రోల్ అలవెన్స్ కింద రూ.5000 చెల్లించాలని డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ కార్మికుల శ్రమ దోపిడీ చేస్తున్న ఆయా కంపెనీలపై చర్యలు తీసుకోవాలని, బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని అన్నారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ కార్మికుల సమ్మె కాలపు ఒప్పందం ప్రకారం అన్ని డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరారు. గత సమ్మె కాలంలో ఒప్పుకున్న 14 డిమాండ్లను అమలు చేయకపోతే ఏ రోజున అయిన కార్మికులు పంప్ హౌస్‌లు (దనోరా, మనిక్ గూడ) బందు చేసి సమ్మెకు వెళ్లవలసిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో దేవేందర్, శ్రీనివాస్, జాదవ్ సంతోష్, హరీష్, సిహెచ్ బాలేష్, ఈ సురేష్ పాల్గొన్నారు.

## నేడు వాంకిడి బంద్‌కు పిలుపు

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో అండర్ పాస్ వంతెన శివాజీ చౌరస్తా వద్ద నిర్మించాలని డిమాండ్ చేస్తూ బుధవారం బందుకు పిలుపునిచ్చారు. హోటల్‌లు, పాన్‌షాపులు, కిరాణ షాపులు, కూరగాయల వ్యాపారస్తులు, అన్ని వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా బందు పాటించాలని మంగళవారం మండలకేంద్రంలో ప్రచారం చేస్తూ వ్యాపార యజమానులకు సూచించారు. ప్రతి ఒక్కరు బందుకు సహకరించాలని అఖిలపక్షంనాయకులు అజయ్, తుకారాం, అశోక్, పెంటు తెలిపారు.

## చిరుధాన్యాల సాగుపై అవగాహన



నవతెలంగాణ-దహెగాం

మండలంలోని గిరవెల్లి గ్రామంలో మంగళవారం అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023ను పురస్కరించుకొని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఏఓ వంశీకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు చిరుధాన్యాలను సాగుచేయాలన్నారు. చిరుధాన్యాలలో అధిగ పోషకాలతో పాటు మాంసకృత్తులు, ఐరన్, మెగ్నీషియం, పొటాషియం అధికంగా ఉంటాయన్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఏఈఓలు సుస్మిత, వెన్నెల, శోభన్, లక్ష్మి పాల్గొన్నారు.

# పెరిక కులస్తులు రాజకీయంగా ఎదగాలి

- జిల్లా అధ్యక్షుడు బేర సత్యనారాయణ

నవతెలంగాణ-లక్షెట్టిపేట్

పెరిక కులస్తులు ఐక్యమత్యంతో ఉండి రాజకీయంగా ఎదగాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బేర సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని స్థానిక ఐబీ విశ్రాంత భవన్‌లో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బేర సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో పెరిక కులస్తులు ఎన్నో బాధలు అనుభవించారన్నారు. పెరిక కులస్తులకు సరైన గుర్తింపు లేకపోవడంతో నిరాధారణకు గురైనట్టు వివరించారు. నేడు జిల్లా వ్యాప్తంగా అవగాహన, ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తూ పెరికల హక్కుల సాధనకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఆస్పత్రి, విద్య, అనాధల కోసం, వ్యాయామ క్రీడాకారుల కోసం సంఘం ఇది వరకే సహకారం అందించినట్లు తెలిపారు. అంతేకాకుండా సంఘం బలోపేతానికి అందరూ కృషి చేయాలని కోరారు. అంతకుముందు పలువురు సంఘం నాయకులు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నప్పుడే సంఘం గురించి మాట్లాడటం ఆ తర్వాత మర్చిపోవడంతో సరైన విధానం కాదని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో పెరికల రాజకీయ భవిష్యత్ సంఘం ఐకమత్యంతో ముడిపడి ఉందన్నారు. అంతేకాకుండా పెరికలలో ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగిన నేతలు, వివిధ రంగాల మేధావులు సంఘం బలోపేతానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, జడ్పీటీసీ ముత్తే సత్తయ్య, నాయకులు బొప్పు సతీష్, నాగభూషణం, మోటపలుకుల గురువయ్య, అంకతి గంగాధర్, కారుకూరి మధు, అక్కల శ్రీధర్, సురేందర్ పాల్గొన్నారు.



## గ్రూప్స్ అభ్యర్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో గ్రూప్-3, 4 నాలుగు పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, రాజేశంలు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అభ్యర్థులకు ఉపయోగపడే విధంగా రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వర్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న 99 మంది అభ్యర్థులకు 90 రోజుల శిక్షణ అనంతరం ఈ మెటీరియల్‌ను పంపిణీ చేయడం జరిగిందని, అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

## నకిలీ ఎరువులు పురుగుమందులు అమ్మితే లైసెన్స్ రద్దు

నవతెలంగాణ-తాండూర్



లైసెన్సు కలిగిన ఫెర్టిలైజర్ యజమానులు నకిలీ, కాలం చెల్లిన ఎరువులు, పురుగు మందులు అమ్మితే లైసెన్సులను రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారిని కల్పన హెచ్చరించారు. మంగళవారం కన్నాల రైతు వేదికలో బెల్లంపల్లి నియోజకవర్గస్థాయి ఫెర్టిలైజర్ డీలర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సాంకేతిక వ్యవసాయా అధికారి శ్రీనివాస్ డీలర్లకు లైసెన్స్‌ను రెనివల్ చేసుకొనే పద్ధతులను వివరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి కల్పన మాట్లాడుతూ డీలర్స్ అందరు సీడ్స్ ఫర్టిలైజర్ లైసెన్సులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. డీలర్లు అమ్మకాలకు సంబంధించిన ఎరువులు పురుగు మందుల స్టాక్ వివరాలను స్టాక్ బోర్డుపై ఉంచాలన్నారు. అక్రమ నిల్వలు ఉన్నట్లయితే చర్యలు తప్పవని పేర్కొన్నారు. విత్తనాలను అమ్మేటప్పుడు డీలర్లు రైతులకు విత్తనాల మొలక శాతం లాట్ నెంబర్ విత్తన తయారీ తేదీ వివరాలతో కూడిన రసీదు ఇవ్వాలని తెలిపారు. నిజకవర్గంలోని డీలర్లు నకిలీ విత్తనాలను అమ్మిన వ్యాపారులకు సహకరించిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏడీఏ సురేఖ, తాండూర్ ఏఓ కిరణ్మయి, బెల్లంపల్లి ఏఓ ప్రేమ్ కుమార్, బీమిని ఏఓ విజయ్, నెన్నెల ఏఓ శ్రీకాంత్, కన్నె పెల్లి ఏఓ వందన పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

నవతెలంగాణ-నస్పూర్



కార్మికుల సంక్షేమానికి సింగరేణి సంస్థ, సి అండ్ ఎండి శ్రీధర్ పనిచేస్తున్నారని డైరెక్టర్ ఆపరేషన్, పా చంద్రశేఖర్, డైరెక్టర్ ఫైనాన్స్, ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ బలరాం అన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియాలోని రూ.9 కోట్ల వ్యయంతో త్రాగునీటి పైపులైన్ల పునరుద్ధరీకరణ పనులను, శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో నూతన క్రషర్2 ను శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గోదావరి నుంచి త్రాగునీరు బెల్లంపల్లి రీజియన్ వరకు పంపిణీ చేయడం జరుగుతుందని, ఈ సరఫరా చేసే పైపులైను 1977లో వేశారని, అవి పాడవడంతో కొత్తగా రూ.9 కోట్లతో 600 ఎమ్ఎమ్ పైప్ లైన్లతో నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ పనులను 9 నెలలో పూర్తి చేసుకుంటుందని, సింగరేణి ప్రాంత ప్రజలకు నీటి ఎద్దడి ఉండదని తెలిపారు. కార్మికులు సంస్థ అభివృద్ధిలో తోడ్పడాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని అన్నారు. కార్యక్రమంలో సివిల్ జనరల్ మేనేజర్ రమేష్ బాబు, ఎస్ఓ టు జీఎం త్యాగరాజు, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సురేందర్ రెడ్డి, అధికారుల సంఘం నాయకులు అబ్దుల్ ఖాదర్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు శ్రీనివాస్, పురుషోత్తమరెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

నవతెలంగాణ-జన్నారం

విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని జన్నారం సర్పంచ్ భూషణ వేణి గంగాధర్ గౌడ్, ఉపసర్పంచ్ జంగం రవి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు వివిధ క్రీడాసామాగ్రిని అందజేశారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపాలనే ఉద్దేశంతో క్యారం బోర్డ్, చెస్ లాంటి క్రీడా సామాగ్రిని అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
# నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
www.navatelangana.com
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 25 జనవరి 2023


## గిరిజనులకు పోలీసుల సహకారం

నవతెలంగాణ-జైనూర్

గిరిజనులకు పోలీసు శాఖ తరపున అన్ని విదాల సహాయ సహకారాలు ఉంటాయని జైనూర్ సీఐ రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని గౌరీ కొలాంగూడ గ్రామ పంచాయతీ పరిధిలో గల లేండిగూడ గ్రామంలో ఆదిమ గిరిజనులకు దుప్పట్లు, స్వెటర్లు, వాలీబాల్ కిట్లు జైనూర్ ఎస్సై మధూకర్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు చిన్న సమస్యలున్నా నేరుగా పోలీసులను సంప్రదించాలని తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలతో పాటు గిరిజనుల విద్యపట్ల పోలీస్ శాఖ ద్వారా సహకరిస్తామని పేర్కొన్నారు. హెల్పింగ్ హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో పంపిణీ చేస్తున్నట్టు పేర్కొన్నారు.

## ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

నవతెలంగాణ-దండేపల్లి

జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని దండేపల్లి ప్రభుత్వ పాఠశాలలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఆడపిల్లల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. రక్తహీనత బాల్య వివాహాలు అనే పలు అంశాలపై వివరించారు. బాలికలు వేదింపులకు గురైతే 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి తెలియజేయలని సూచించారు. సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు, లింగవివక్షను ఎదుర్కోవడం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఆకతాయిల నుంచి రక్షణ పొందే విధానంపై వివరించారు. విద్యార్థినులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి పాల్గొన్నారు.

## పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్



నవతెలంగాణ-సిర్పూర్(టి)

విద్యార్థి దశ నుండే అన్ని అంశాలపై అవగాహన కలిగి లక్ష్య సాధన దిశగా చదువుకోవాలని అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకోవచ్చని ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కాగజ్‌నగర్ గురుకుల పాఠశాలను కలెక్టర్ కాస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వంట గది, భోజనాల గది, తరగతి గదులను, పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి, ఉన్నత చదువులు అభ్యసించి జీవితంలో ఎదగాలన్నారు. వార్షిక పరీక్షలో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే పద్ధతిలో బోధించాలన్నారు.

## ప్రారంభమైన ఉపాధ్యాయుల ధ్రువపత్రాల పరిశీలన



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సర్వం సిద్ధమైంది. ఇటీవల ఈ ప్రక్రియ నిర్వహణకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపిన నేపథ్యంలో ఉపాధ్యాయుల్లో హర్షం వ్యక్తమవుతోంది. పదోన్నతులు పొందే ఉపాధ్యాయుల ధృవపత్రాలను పరిశీలించేందుకు విద్యాశాఖ యంత్రాంగం పూర్తి చర్యలు చేపట్టింది. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డిఈఓ కార్యాలయంలో పదోన్నతి పొందే వారి సర్టిఫికేట్‌లను పరిశీలించారు. కటాఫ్ ఇయర్‌కు సంబంధించి షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ముందస్తుగానే ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. పదోన్నతుల సమయంలో ఇబ్బందులు కలగకుండా విద్యాశాఖ ప్రక్రియ చేపట్టింది. తాజాగా ప్రారంభమైన ధృవపత్రాల పరిశీలనలో పాల్గొన్న ఉపాధ్యా యులకు ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా తగు చర్యలు తీసుకున్నారు. ఈ ప్రక్రియకు ఎనిమిది బృందాలను ఏర్పాటు చేసి ధృవపత్రాలను స్వీకరించారు. ఈ ప్రక్రియను డిఈఓ ప్రణీత పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## బెల్లంపల్లి ఏరియాలో ఉత్తమ ఉద్యోగుల ఎంపిక

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలో ఉత్పత్తి సాధన విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేసినట్టు బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తమ అధికారిగా ఆర్.సతీష్‌బాబు, డీజీఎం(సివిల్), డెస్క్ సింగరేణియన్‌గా సంపతి తిరుపతి, సీపీ ఆపరేటర్(ఖైరిగూడ), ఓసీపీలను తేదీ 26న కొత్తగూడెం ప్రకాశం మైదానంలో జరిగే రిపబ్లిక్ డే వేడుకల్లో సన్మాన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. బెల్లంపల్లి ఏరియా స్థాయిలో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన అదునూరి సుధాకర్, వెల్డర్ ఖైరిగూడ ఓసీపీ, బండి శ్రీనివాసులు హెడ్ ఓవర్‌మెన్ ఖైరిగూడ ఓసీపీలను గోలేటి శ్రీ భీమన్న మైదానంలో జరిగే రిపబ్లిక్ డే వేడుకల్లో సన్మానించి జ్ఞాపికను అందజేయనున్నట్టు తెలిపారు.

## ఘనంగా మార్కెండేయ జయంతి

నవతెలంగాణ-రెబ్బెన

మండల కేంద్రంలో గోలేటి పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మార్కెండేయ జయంతిని పురస్కరించుకొని ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మొదటగా మార్కెండేయ స్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ ముఖ్య అతిథిగా స్వామి వారి పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో రెబ్బెన మండల పద్మశాలి సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మారిన వెంకటేశ్వర్లు, దోమల పోచయ్య, గోలేటి పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వీరస్వామి, కోశాధికారి మారిన చందర్, మాంతు సమ్మయ్య అంకం కైలాసం, పున్న శంకర్, వేముల సత్యనారాయణ, చెరిగల సత్యనారాయణ, రవీందర్, బుర్ర శ్రీనివాస్, ఎలిగేటి ఉపేందర్, నల్ల సారంగపాణి, తోడూరి రమేష్, పాల్గొన్నారు.

## కంటి వెలుగు శిబిరాల సందర్శన

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని ద్యాగవాడ, కురన్నపేటలో కంటి వెలుగు శిబిరాలను కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ, ఎస్పీ ప్రవీణ్ కుమార్ మంగళవారం సందర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లపై ఆరా తీశారు. నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

## నేత్ర వైద్య శిబిరానికి స్పందన

నవతెలంగణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రజా లైఫ్ కేర్ ఆసుపత్రిలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ శిబిరంలో 52 మందిని పరీక్షించి 27 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి విడతల వారీగా ఆపరేషన్లు చేయించనున్నామని, ప్రతీ మంగళవారం నిర్వహించే ఈ ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు సూచించారు.

## ఆర్టీసీ డిపోలో డ్రైవర్స్ డే

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ డిపోలో మంగళవారం డ్రైవర్స్ డే ను నిర్వహించారు. ఉదయం 4గంటల నుండి ప్రతి డ్రైవర్‌కు డిపో మేనేజర్ ఎన్.సాయన్న గులాబీ పువ్వు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. డ్రైవింగ్‌లో నైపుణ్యం సాధించిన పలువురు డ్రైవర్లను సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఐ.రాజశేఖర్, డ్రైవర్లు పాల్గొన్నారు.

# పత్తికి రూ.15వేలు ధర కల్పించాలని ధర్నా

నవతెలంగాణ-బోథ్

రైతుల పండించిన పత్తికి రూ.15వేల ధర కల్పించాలని మంగళవారం అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో పొచ్చెర ఎక్స్‌రోడ్ సమీపంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ పత్తికి సిసిఐ వాణిజ్య కొనుగోలు ప్రారంభించి రూ.15వేలు చెల్లించాలన్నారు. విదేశీ పత్తి దిగుబడిని ఆపాలన్నారు. వ్యాపారస్తులతో కుమ్మక్కైన సిసిఐ అధికారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని విడనాడాలన్నారు. దాదాపు గంటసేపు రాకపోకలకు అంతరాయం కలిగింది. పోలీసులు కల్పించుకొని ఆందోళనకారులను సముదాయించి ఆందోళన విరమింపజేశారు. కార్యక్రమంలో రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బురుగు మల్లేష్, నాయకులు షేక్ నాజర్ అహ్మద్, రాజశేఖర్, దివాకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, భీమ్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, మహమూద్ పాల్గొన్నారు.



# స్వరాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధి

- మంత్రులు సత్యవతి రాథోడ్, ఇంద్రకరణ్‌రెడ్డి
- ఖానాపూర్‌లో ఘనంగా సాయిబాబా వార్షికోత్సవం



నవతెలంగాణ-ఖానాపూర్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత దేవాలయాలను అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర మంత్రులు సత్యవతి రాథోడ్, ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు .మంగళవారం ఖానాపూర్ లోని శ్రీ వీరాంజనేయ శివ సాయి సమాజ్ 26వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయానికి వచ్చిన మంత్రులు ఎమ్మెల్యే రేఖా నాయక్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ శ్రీ వీరాంజనేయ శివ సాయి సమాజ్ ఆలయానికి రూ.50 లక్షలు త్వరలోనే మంజూరు చేయనున్నట్టు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు ఆలయాలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తూ అభివృద్ధి పరుస్తున్నారన్నారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 17న ప్రారంభమైన 26వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు సుమారు 50 వేల మంది సాయిబాబాని దర్శించుకొని పూజలు చేశారు. మహా జాతర సందర్భంగా ఖానాపూర్ సీఐ అజయ్ బాబు, ఎస్సై శంకర్ ఆధ్వర్యంలో ఉదయం నుండే ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూశారు. ఈ వేడుకలలో జిల్లా పరిషత్ చైర్మన్ విజయలక్ష్మి రామ్ కిషన్ రెడ్డి, బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పైడిపల్లి రవీందర్ రావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, ప్రధాన కార్యదర్శి కొక్కుల ప్రదీప్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పల లక్ష్మి శంకర్ పటేల్, ఎంపీపీ అబ్దుల్ మోహిదు, పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప సత్యనారాయణరెడ్డి, రాథోడ్ రాము నాయక్, బక్కశెట్టి కిషోర్, గొర్రె గంగాధర్, జన్నారపు శంకర్ పాల్గొన్నారు.

# కంటి వెలుగు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- జడ్పీటీసీ మేడి సునితాతిరుపతి



నవతెలంగాణ-జైపూర్

మండల పరిధిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు పరీక్షా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ మేడి సునితాతిరుపతి కోరారు. మంగళవారం ఇందారం గ్రామంలో కంటి వెలుగు పరీక్షా కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్‌రావు, సర్పంచ్ గడ్డం మంజుల ప్రసాద్, వైఎస్ ఎంపీపీ పెద్దపల్లి రమేశ్‌తో కలిసి ప్రారంభించారు. మండల కేంద్రంలో గల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు బెజ్జాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరు కంటి పరీక్ష కేంద్రాల ద్వారా సేవలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీటీసీ అర్కె స్వర్ణ సంతోష్, కుందారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

**తడిపొడి చెత్త వినియోగంపై విద్యార్థులకు అవగాహన**

స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇందారం గ్రామ పంచాయతీ పరిధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తడిపొడి చెత్త వినియోగంపై అవగాహన కల్పించారు. తడిపొడి చెత్తను వేరువేరుగా ఉంచి వాటిని ఏ విధంగా ఉపయోగించుకోవాలనే విషయమై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 8, 9, 10 తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు ఎస్జీటీల పదోన్నతి ధ్రువ పత్రాల పరిశీలన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యాశాఖలో వివిధ యాజమాన్యాల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా పని చేస్తున్న వారికి తదుపరి పదోన్నతి స్కూల్ అసిస్టెంట్ ఇవ్వడానికి బుధవారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ధృవీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని డీఈఓ అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు పరిశీలన ఉంటుందని తెలిపారు. దీనిలో భాగంగా గణితశాస్త్రం స్కూల్ అసిస్టెంట్ కోసం ఉర్దూ మీడియం కలవారికీ కటాఫ్ సంవత్సరం 2010గా నిర్ణయించామని, తెలుగు మీడియంకు 2005, వికలాంగులకు 2010 నిర్ణయించినట్లు పేర్కొన్నారు. భౌతిక శాస్త్రం స్కూల్ అసిస్టెంట్ కోసం ఉర్దూ, తెలుగు మీడియంకు 2010గా నిర్ణయించామని, బయలాజికల్ సైన్స్ ఉర్దూ మీడియం 2002గా తెలుగు మీడియం 2003గా వికలాంగులు 2010గా, సాంఘిక శాస్త్రం ఉర్దూ 2000 సంవత్సరంగా తెలుగు మీడియం 2010గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఉర్దూ స్కూల్ అసిస్టెంట్ 2000 సంవత్సరంగా, స్కూల్ అసిస్టెంట్ తెలుగు కోసం జనరల్ అభ్యర్థులకు 2001, ఎస్టీలకు 2002, ఎస్సీలకు 2003గా, స్కూల్ అసిస్టెంట్ హిందీ ఇంగ్లీష్ వారికి 2002గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు ఉపాధ్యాయులు పై విషయాలను గుర్తుంచుకొని ధృవీకరణ ప్రక్రియకు హాజరు కావాలని పేర్కొన్నారు.

## ఆకట్టుకున్న బొమ్మల కొలువు

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఇల్లందు క్లబ్‌లో మంగళవారం సింగరేణి లేడిస్ క్లబ్ ఆధ్వర్యంలో బొమ్మల కొలువు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్) చంద్రశేఖర్ సతీమణి పల్లవి హాజరై బొమ్మల కొలువును ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లవి మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా ఎక్కడ లేని విధంగా మనీ దీపం శ్రీరాంపూర్ ఏరియాలో పెట్టారని క్లబ్ సభ్యులను అభినందించారు. అలాగే మహిళలందరూ అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు. ఈ సందర్భంగా సేవాధ్యక్షురాలు రాజకుమారి మాట్లాడుతూ బొమ్మల కొలువు కార్యక్రమానికి పల్లవి చంద్రశేఖర్ రావటం చాలా సంతోషకరమైన విషయం అని అన్నారు.

## ఇంటి నుంచే స్వచ్ఛతను అలవరుకోవాలి

నవతెలంగాణ-భీమారం

విద్యార్థులు ఇంటి నుంచే స్వచ్ఛతను అలవరుచుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్ సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు మంగళవారం డ్రై అండ్ వెట్ వేస్ట్ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లో మిగిలి పోయిన వ్యర్థాలను తడి చెత్త, పొడి చెత్త వేర్వేరు చేసి ఎప్పటికప్పుడు ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి శుభ్రతను అమ్మపైనే వదిలేసి బాధ్యతారాహిత్యంగా ఉండరాదని తెలిపారు. మంచి అలవాట్లను ప్రేరేపించుకోవడం ద్వారా విద్యార్థులకు సామాజిక స్పృహ పెరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అధికారులు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## షాట్‌సర్క్యూట్‌తో పత్తి దగ్ధం

నవతెలంగాణ-భీమారం

మండల పరిధిలోని పోలంపల్లి గ్రామంలో ఇంట్లో నిల్వ చేసుకున్న పత్తికి మంగళవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఏరుకొండ సుమన్‌గౌడ్ అనే రైతు 6 ఎకరాల్లో పత్తి సాగు చేయగా ఇంట్లో నిల్వ చేసిన 35 క్వింటాళ్ళ పత్తికి షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధంమైంది. ఇంట్లో టీవికి వెళ్ళే కరెంట్ బోర్డులో షార్ట్‌సర్క్యూట్ ఏర్పడటంతో వైర్ల నుంచి చలరేగిన మంటలు నిల్వ చేసిన పత్తికి అంటుకుంది. గమనించిన ఇంట్లో ఉన్నవారు కేకలు వేయడంతో స్థానికులు వచ్చి విద్యుత్ సరఫరా నిలిపివేసి మంటలు ఆర్పేశారు. ఇంట్లో వారు వెంటనే తేరుకోకపోతె పెద్ద ప్రమాదమే జరిగేదని స్థానికులు తెలిపారు. ప్రమాదంలో సుమారు 4 క్వింటాళ్ళ పత్తి కాలిపోయి ఉంటుందని బాధితుడు తెలిపాడు.



## ట్రాక్టర్, బైక్ ఢీకొని ఇద్దరి మృతి



నవతెలంగాణ-కెరమెరి

ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీ కొనటంతో ఇద్దరు మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలోని బాబేఝరి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జోడేఘాట్ గ్రామానికి చెందిన పెందూర్ రాము(35) తన ద్విచక్ర వాహనంపై కుంరం బాదిరావ్‌తో కలిసి పని నిమిత్తం మండల కేంద్రానికి బయలు దేరారు. మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్, బైక్ ఒకదానికొకటి ఢీకొట్టడంతో పెందూర్ రాము అక్కడికక్కడే మృతి చెందగా, కుంరం బదిరావ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై, ఎంపీపీ మోతీరాం సంఘటన స్థలానికి చేరుకుని గాయాలపాలైన బాదిరావ్‌ను మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బాదిరావ్ మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ అధికవేగంతో అజాగ్రత్తగా నడపడంతోనే తన భర్త రాము, మరో వ్యక్తి బాదిరావ్ మరణానికి కారణమైనట్లు ఇందిరాబాయి ఆరోపించారు. ఆమె పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

## ఘనంగా భక్త మార్కండేయ జయంతి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని స్థానిక గణపతి దేవాలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ స్వామి జయంతి వేడుకలను ఆ సంఘం అధ్యక్షులు వనం సత్యనారాయణ, ఆడేపు తిరుపతి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్టీరింగ్ కమిటీ సభ్యులు భూర సారంగపాని కార్యదర్శులు బట్టల సమ్మయ్య దంపతులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు బొద్దుల మల్లేష్, అడేపు లక్ష్మణ్, కోశాధికారి వేముల వెంకటేశం గౌరవ అధ్యక్షుడు మిట్టపల్లి శ్రీనివాస్, వేముల అశోక్, వర్తక సంఘం అధ్యక్షుడు ఆడేపు కృష్ణకుమార్, మెర్గు రాజేశం, బండారి శ్రీనివాస్, వోడ్నాల శ్రీనివాస్ కనుకుట్ల సమ్మయ్య, మార్కండేయ, అనుమండ్ల తిరుపతి, వనం యాదగిరి, రాజేష్ కన్న, రాజు, కొండ కుమార్, నల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

**దండేపల్లి :** పద్మశాలి కులబంధువుల ఆరాధ్య దైవమైన మార్కండేయస్వామి మహర్షి జయంతి పురస్కరించుకోని దండేపల్లిలో పద్మశాలి సంఘ భవనంలో మంగళవారం మార్కండేయ స్వామి జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో అర్చకుడు బ్రహ్మ శ్రీ నూతి బ్రహ్మచారి శ్రీమార్కండే స్వామికి మహా రుద్రాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలను నిర్వహించగా, పద్మశాలి కులబంధువులు ప్రత్యేక పూజలతో మొక్కులు చెల్లించుకున్నారు. సంఘం పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శంకర్ పతాకాన్ని ఆవిష్క రించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వడ్డెపల్లి దేవయ్య, కుడికాల రాజ్ కుమార్, ఎనగందుల దుబ్బయ్య శ్రీనివాస్, శంకర్, దేవేందర్, రామస్వామి, రవి, తిరుపతి, శంకర్, గంగన్న సత్యం పాల్గొన్నారు.

## కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-దండేపల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రెండో విడత కంటి వెలుగు పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ కోరారు. మండలంలోని చింతపల్లిలో మంగళవారం రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజలలో వెలుగు నింపేందుకు కంటి వెలుగు కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ గ్రామాన ప్రారంభించాలని పేర్కొన్నారు. ప్రజలు కంటి సమస్య, దూర దగ్గర దృష్టి లోపం ఉంటే తప్పకుండా కంటి వెలుగు శిబిరానికి వచ్చి కంటి పరీక్షలు చేయించుకో వాలన్నారు. కంటి పరీక్ష అవసరం ఉంటే వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కండ్లద్దాలు ఇస్తున్నటు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పసర్తి అనిల్, ఎంపీడీఓ మల్లేశం, సర్పంచ్ అక్కల దేవేంద్ర, ఉపసర్పంచ్ అక్కల తిరుపతి, నాయకులు అక్కల రాజు, లింగంపల్లి బాపు, మల్యాల శ్రీనివాస్, గోపు రవి, వైద్యులు సతీశ్, శోభారాణి, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మణ్, కార్యదర్శి పున్నం పాల్గొన్నారు.

**కంటి వెలుగు కేంద్రాల సందర్శన**

**తాండూర్ :** మండలంలోని కాసిపేట, అచలాపూర్ కంటి వెలుగు కేంద్రాలను స్పెషల్ ఆఫీసర్( క్వాలిటీ అండ్ కంట్రోల్ )హరిత రాథోడ్ సందర్శించారు. కంటి వెలుగు కేంద్రాల్లోని సిబ్బంది పనితీరును అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కంటి వెలుగు కేంద్రానికి ప్రజల నుండి వస్తున్న స్పందనను అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఇప్పటివరకు అచలాపూర్‌లో 251 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 61 మందికి అద్దాలు పంపిణీ చేశారు. 56 మందికి కంటి ఆపరేషన్ పెద్ద ఆస్పత్రులకు రెఫర్ చేసినట్లు అచలాపూర్ పంచాయతీ కార్యదర్శి క్రాంతి తెలిపారు. కాసిపేట గ్రామపంచాయతీలో 620 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 271 మందికి అద్దాలు పంపిణీ చేసినట్లు ఏఎన్ఎం తులసి తెలిపారు. 68 మందినికంటి ఆపరేషన్ల నిమిత్తం పెద్ద ఆసుపత్రులకు రెఫర్ చేసినట్లు పేర్కొన్నారు. గోపాల్‌నగర్ పంచాయతీలో రెండు రోజులపాటు నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో 425 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి వసంత తెలిపారు.

**సూపాకలో కంటి వెలుగు ప్రారంభం**

**కోటపల్లి :** మండలంలోని సూపాక గ్రామంలో మంగళవారం ఎంపీపీ మంత్రి సురేఖ, సర్పంచ్ కాసేట్టి సతీష్, కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వం మహత్తరమైన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి రాష్ట్రంలో కంటి సమస్యతో బాధపడుతున్న వారికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అధునాతన పరికరాలతో కంటి పరీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కంటి లోపాలను నివారించడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశ పెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూ బీఆర్ఎస్‌కు వెన్నుదన్నుగా ఉంటూ చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసే అభివృద్ధిలో బాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సాంబగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎరినాగుల ఓదెలు, సిర్సా సర్పంచ్ పెద్దింటి పున్నం చంద్, స్థానిక ఎంపీటీసీ మరిశెట్టి తిరుపతి, ఉప సర్పంచ్, మండల్ యూత్ ఉపాధ్యక్షులు ఆసంపెల్లి సంపత్ కుమార్ పాల్గొన్నారు.